క్లుప్తంగా

స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలు విస్తరించండి



కలెక్టర్‌కు స్టిక్కర్, జ్ఞాపిక అందజేస్తున్న స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా అధికారులు

తిరుపతి అర్బన్: జిల్లాలో స్కౌట్స్ అండ్ గైడ్స్ సేవలను మరింతగా విస్తరించాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సూచించారు. 75వ భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అవతరణ దినోత్సవం సందర్భంగా గురువారం కలెక్టరేట్‌లో ఆ విభాగానికి చెందిన పలువురు కలెక్టర్‌ను కలిశారు. కలెక్టర్‌కు స్టిక్కర్, జ్ఞాపిక బహూకరించారు. కార్యక్రమంలో స్కౌ ట్స్ అండ్ గైడ్స్ జిల్లా కమిషనర్లు ఎంఎం రెడ్డి, టి రమేష్ బాబు, జిల్లా కార్యదర్శి ఎం.జయరాం, రాష్ట్ర సహాయ కార్యనిర్వాహక కమిషనర్ కోటేశ్వరరావు, జిల్లా ట్రైనింగ్ కమిషనర్లు జి.వెంకటేశ్వర్లు, బాలిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఆహారం పంపిణీ



మిగిలిన ఆహారాన్ని పంచిపెడుతున్న కేటరింగ్ బృందం

తిరుపతి తుడా: తిరుపతి ప్రెస్ క్లబ్ కమిటీ బుధవారం ప్రమాణ స్వీకారం చేసింది. ఈ సందర్భంగా సభ్యులకు విందు ఏర్పాటుచేశారు. అక్కడ మిగిలిపోయిన ఆహారాన్ని వృథాగా పడేయకుండా కేటరింగ్ యజమాని మధు బృందం రైల్వే స్టేషన్ సమీపంలో పేదలకు పంచిపెట్టారు. వారిని పలువురు అభినందించారు.

ఆర్‌ఏఆర్‌ఎస్‌లో ఘనంగా ఎన్జీరంగా జయంతి



ఎన్జీరంగా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏడీఆర్, శాస్త్రవేత్తలు

తిరుపతి సిటీ : స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం (ఆర్‌ఏఆర్‌ఎస్)లో గురువా రం ఆచార్య ఎన్జీ రంగా జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఇందులో ఏడీఆర్ డాక్టర్ సుమ తి ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన చిత్రపటాని కి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ ఆచార్య ఎన్జీ రంగా జమిందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడారని గుర్తు చేశా రు. రైతు కూలీ సంఘాలను ప్రోత్సహించారని, భావితరాలకుఆయన ఆదర్శమని పేర్కొన్నారు.

తిరుమలలో డంపింగ్ యార్డు పరిశీలన



డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

తిరుమల: తిరుమలలోని కాకులమాను దిబ్బ వద్ద ఉన్న డంపింగ్ యార్డును గురువారం ఉదయం టీటీడీ చైర్మన్ బి.ఆర్.నాయుడు పరిశీలించారు. చెత్త సేకరణ, తడి, పొడి చెత్త విభజన, వ్యర్థాల నిర్వహణపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. టీటీడీ వీజీవో సురేంద్ర పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దుకు సహకరించాలని వినతి



పనబాక లక్ష్మికి వినతి పత్రం అందజేస్తున్న ఏపీసీపీఎస్ ఉద్యోగ సంఘం నాయకులు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఉద్యోగుల పాలిట శాపంగా మారిన సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించేలా సహకరించాలని కేంద్ర మాజీ మంత్రి, టీటీడీ బోర్డు సభ్యురాలు పనబాక లక్ష్మిని సీపీఎస్ ఉద్యోగులు కోరారు. వారు గురువారం పనబాక లక్ష్మిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఏపీసీపీఎస్ ఉద్యోగ సంఘం తిరుపతి జిల్లా సలహాదారు రేగంటి దేవానంద్, జిల్లా ప్రధాన కార్యదర్శి పీవీ.సుబ్బారెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్ శ్రీనాథ్, మంజుల, ఉపాధ్యక్షురాలు విజయలక్ష్మి, సభ్యులు వరలక్ష్మి, మల్లీశ్వరయ్య పాల్గొన్నారు.

నలుగురిపై హత్యాయత్నం కేసు నమోదు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి రెండో పట్టణ పరిధిలో బుధవారం విష్ణువర్ధన్ అనే వ్యక్తిపై జరిగిన హత్యాయత్నం కేసులో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. పుట్టినరోజు సందర్భంగా బుధవారం రాత్రి కేక్ కట్ చేస్తున్న విష్ణువర్ధన్‌పై వాసు, ముని, భరత్ సహకారంతో జగన్ కేక్ కోసిన కత్తితోనే పొడిచాడు. పాతకక్షల నేపథ్యంలోనే ఈ గొడవ జరిగినట్టు సీఐ తెలిపారు. నలుగురిపై కేసు నమోదు చేశామన్నారు. నిందితుల కోసం గాలిస్తున్నట్లు పేర్కొన్నారు.



టూవీలర్‌పై వెళుతున్న నలుగురు యువకులు

ట్రాఫిక్ ఉల్లంఘనులు

- ద్విచక్ర వాహనాల్లో యథేచ్ఛగా ట్రిపుల్ రైడింగ్
- తరుచూ జరుగుతున్న ప్రమాదాలు
- ప్రాణాలు పోతున్నా పట్టించుకోని వైనం

ద్విచక్ర వాహనంలో ప్రయాణం ఇద్దరికి మాత్రమే అనుమతి. తిరుపతి నగరంలో కొంతమంది బైక్ రైడర్లు నియమాలను పాటించడంలేదు. ముగ్గురు, నలుగురిని ఎక్కించుకుని అతివేగమే హద్దుగా దూసుకెళుతున్నారు. అధికారులు అవగాహన కల్పిస్తున్నా ప్రయోజనం లేకుండాపోతోంది. రవాణాశాఖ(ఆర్టీఏ) అధికారులు, ట్రాఫిక్ పోలీసులు ఏటా వేల కేసులు నమోదు చేస్తున్నా వారి వ్యవహారశైలిలో మార్పు రావట్లేదు. తరచూ ప్రమాదాల బారిన పడి గాయాలపాలవుతున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల వ్యవహారశైలిపై దృష్టి పెట్టకపోవడంతోనే ఇలా జరుగుతోందన్న విమర్శలు ఉన్నాయి.

తిరుపతి మంగళం : 'టూవీలర్ ఫర్ టూ ఓన్లీ' అని మోటారు వాహన చట్టం స్పష్టం చేస్తోంది. అయినప్పటికీ ద్విచక్ర వాహనంపై ఇద్దరు కంటే ఎక్కువ మంది ప్రయాణించడం తిరుపతి నగరంలో సాధారణమైంది. ప్రధానంగా యువకులు ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘిస్తూ ట్రిపుల్ రైడింగ్ చేస్తూ నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. తిరుపతి నదరంలో టూ వీలర్స్ వినియోగించే వారిలో ఎక్కువ మంది యువకులు, విద్యార్థులు ఉన్నట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తోంది. ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు చేస్తున్నట్లు తెలిసినా.. జంక్షన్ వచ్చినా ఆఖరులో కూర్చున్న యువకుడు తక్షణం దిగిపోయి నడుస్తూ ముందుకు వెళ్లడం చూస్తుంటాం. ఇలా చేస్తూ ట్రిపుల్ రైడర్లు అనేక సందర్భాల్లో పోలీసుల్ని పక్కదారి పట్టిస్తున్నారు. దీనికితోడు అతివేగంతో దూసుకుపోతూ తరుచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. బాధితుల్లో ఎక్కువ శాతం అవివాహితులే కావడంతో కన్నవారికి పుట్టెడు దుఃఖాన్ని మిగిలిస్తున్నారు.

వాహనం అదుపు అసాధ్యం...
ప్రతి వాహనానికీ దాన్ని తయారు చేసే కంపెనీ కొన్ని ప్రమాణాలు నిర్దేశిస్తుంది. ఇందులో భాగంగానే టూవీలర్‌లో ఇద్దరు మాత్రమే ప్రయాణించేలా రూపొందిస్తుంది. ముందు డ్రైవర్, వెనుక పిలియన్ రైడర్ మాత్రమే ప్రయాణించాలంటూ తమ నిబంధనల్లో స్పష్టం చేస్తుంది. దీనికి సాంకేతికంగానూ ప్రత్యేక కారణాలు ఉన్నాయి.

ఇంజిన్ కెపాసిటీ...
మోటారు వాహనాలకు ఉండే ప్రతి ఇంజన్‌కూ ప్రత్యేక సామర్థ్యం ఉంటుంది. దీన్నే సాంకేతికంగా ఇంజిన్ కెపాసిటీ అంటారు. ఆ వాహనంలో ఎందరు ప్రయాణించడానికి అనువుగా రూపొందిస్తారో అదే సామర్థ్యంతో ఇంజన్ అభివృద్ధి చేస్తారు. నిర్దేశించిన సంఖ్య కంటే ఎక్కువ మంది ప్రయాణించినప్పుడు ఆ ప్రభావం ఇంజిన్‌పై పడి వేగం తగ్గుతుంది.

యాక్సిలరేటింగ్ కెపాసిటీ...
ఒక వాహనం ఎంత వేగంతో దూసుకుపోవాలనేది స్పష్టం చేసేదే యాక్సిలరేటింగ్ కెపాసిటీ. సదరు వాహనంపై పరిమితికి మించి ప్రయాణికులు ఎక్కినప్పుడు ఈ కెపాసిటీ తగ్గుతుంది. సాధారణంగా గంటకు 60 కిలోమీటర్ల వేగంతో నడిచే వాహనం ఇలాంటప్పుడు 40కిమీ మించదు. ఈ ప్రభావం ఓవర్‌టేకింగ్, తదితర సమయాల్లో ప్రమాదాలకు కారణమవుతుంది.

బ్రేకింగ్, బ్యాలెన్సింగ్ కెపాసిటీ..
వాహనం ప్రమాదానికి లోనుకాకుండా ఉండాలంటే బ్రేకింగ్, బ్యాలెన్సింగ్ కెపాసిటీ అత్యంత కీలకం. సరైన సమయానికి బ్రేక్ వేయగలగడం, అవసరమైన స్థాయిలో బ్యాలెన్స్ చేసుకోవడం తప్పనిసరి. ట్రిపుల్ రైడింగ్ చేసే సమయంలో రెండు కెపాసిటీలపైనా ప్రభావం పడి ఎదురుగా ముప్పును గుర్తించినా తక్షణం స్పందించి వాహనాన్ని ఆపలేరు.

కఠిన చర్యలు అవసరం...
ప్రస్తుతం తిరుపతి నగరంలో డ్రంకెన్ డ్రైవింగ్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపడం వంటివి చేస్తే అధికారులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. వాహనం స్వాధీనం చేసుకుని కౌన్సిలింగ్ తర్వాత అప్పగిస్తున్నారు. అనేక సందర్భాల్లో కోర్టుల్లోనూ అభియోగ పత్రాలు దాఖలు చేస్తున్నారు. యువతను బలితీసుకుంటున్న ట్రిపుల్ రైడింగ్ విషయంలోనూ ఇలాంటి కఠిన చర్యలు అవసరం. డ్రంకెన్ డ్రైవ్ విషయంలో అనుసరిస్తున్న మాదిరిగా కుటుంబ సభ్యులతో కౌన్సిలింగ్‌కు హాజరయ్యే విధానం అవలింబించాలి. అప్పటి వరకు వాహనాన్ని విడిచిపెట్టకూడదు. ఎందరో తల్లిదండ్రులకు కడుపుకోత మిగిలిస్తున్న ట్రిపుల్ రైడింగ్‌ను అదుపు చేయడానికి కుటుంబ సభ్యుల సహకారం ఎంతో అవసరమని రవాణా రంగ నిపుణలు చెబుతున్నారు.

ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నాం...



నగరంలో ద్విచక్ర వాహనాలపై ముగ్గురు ప్రయాణించే ఉల్లంఘనను తీవ్రంగా పరిగణిస్తున్నాం. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్స్ నిర్వహిస్తున్నాం. దీనికోసం స్పెషల్ టీమ్స్ కూడా రంగంలోకి దిగాయి. ట్రిపుల్ రైడింగ్ చేస్తూ చిక్కిన వారికి జరిమానా విధించడంతో పాటు కౌన్సిలింగ్ ఇస్తారు. ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని మరికొన్ని కఠిన చర్యలు తీసుకోవాలని భావిస్తున్నాం. ట్రిపుల్ రైడింగ్ చేస్తూ చిక్కిన వారి నుంచి వాహనం స్వాధీనం చేసుకుని వారికి ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ లో(టీటీఐ) సమగ్ర కౌన్సిలింగ్ ఇవ్వనున్నాం. అనంతరం జరిమానా కట్టించుకుని వాహనం తిరిగి ఇవ్వడం లాంటి చర్యలు చేపడుతున్నాం.

\- మురళీమోహన్, తిరుపతి జిల్లా రవాణాశాఖాధికారి

ఇంటింటా నైపుణ్య గణన



మాట్లాడుతున్న జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి

భాకరాపేట : ఇంటింటా నైపుణ్య గణనను సమర్థవంతంగా నిర్వహించి వివరాలు సేకరించాలని చిన్నగొట్టిగల్లు ఎంఈవో సత్యనారాయణ తెలిపారు. జగనన్న సమావేశ మందిరంలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యువతకు అవసరమైన నైపుణ్యంలో శిక్షణ ఇచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నైపుణ్య గణన సహాయ పడుతుందన్నారు. నైపుణ్య గణనకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సోమశేఖర్‌రెడ్డి, ఏవో సతీష్, పంచాయతీ కార్యదర్శి మదనమోహనరా జు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నైపుణ్య గణనపై శిక్షణ
పాకాల : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి నైపుణ్య గణనపై శిక్షణ ఇచ్చారు. నైపుణ్యాభివృద్ధి కో-ఆర్డినేటర్ సాయిలక్ష్మి, ఏవో రవిచంద్ర, ఎంపీడీవో మాట్లాడుతూ 15 నుంచి 59 ఏళ్లలోపు ఉన్న వారి వివరాలను సేకరించాలని సూచించారు. అనంతరం వారి ఆస్తికి అనుగుణంగా శిక్షణ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి, పంచాయతీ రాజ్ ఏఈ రాజామస్తానయ్య పాల్గొన్నారు.

దళితులపై దాడులను నియంత్రించాలి

పాకాల : రాష్ట్రంలో దళితులపై జరుగుతున్న దాడుల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి మధుసూదన్‌రావు డిమాండ్ చేశారు. ఆయన గురువారం పాకాలలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా దళితులు, మహిళలు, చిన్నారులపై దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నారని పేర్కొన్నారు. శాంతిభద్రతలు క్షీణించాయని మండిపడ్డారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. శుక్రవారం నుంచి నిర్వహిస్తున్న ప్రజాపోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ నెల 15న కలెక్టర్ కార్యాలయాలు, మండలాల్లోని ప్రభుత్వ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ముగిసిన సుబ్రమణ్యస్వామి హోమం



పూర్ణాహుతి చేస్తున్న అర్చకులు, వేద పండితులు



వేదికపై కొలువైన వళ్లీ, దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి

తిరుపతి కల్చరల్: కపిలేశ్వరస్వామి ఆలయంలో మూడు రోజులుగా చేపట్టిన సుబ్రమణ్యస్వామి హోమం గురువారం రాత్రి ఘనంగా ముగిసింది. ఇందులో భాగంగా యాగశాలలో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు పూజ, హోమం, మహాపూర్ణా హుతి, కలశ ఉద్వాసన చేపట్టారు. సుబ్రమణ్య స్వామికి మహాభిషేకం, కలశాభిషేకం, నివేదన, హారతి నిర్వహించారు. సాయంత్రం 5.30 గంటల కు శ్రీవళ్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి కల్యాణాన్ని కనుల పండువగా చేపట్టారు. శుక్రవారం దక్షిణామూర్తి స్వామి హోమం జరుగనుంది. కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో దేవేంద్రబాబు, ఏఈవో శ్రీనివాసులు, సూపరింటెండెంట్లు భూపతి, శ్రీనివాసులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాలక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి రుద్రపాదాల ముక్కోటి ఉత్సవాలు



ముక్కోటి ఆలయం

చంద్రగిరి: మండలంలోని స్వర్ణముఖినది ఒడ్డున వెలసిన ఆనందవల్లీ సమేత అగస్త్యేశ్వరస్వామి(ముక్కోటి) ఆలయంలో ఈ నెల 12 నుంచి 20వ తేదీ వరకు రుద్రపాదాల ముక్కోటి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు పనులు ప్రారంభించినట్టు ఆలయ ధర్మకర్త మొగిలి రఘునాథరెడ్డి తెలిపారు. ప్రధాన ఘట్టమైన రుద్రపాదాల ముక్కోటి నాడు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారని, అందుకు అనుగుణంగా ప్రత్యేక క్యూలు ఏర్పాటుచేస్తున్నట్టు చెప్పారు. 12వ తేదీ ఉదయం ధ్వజారోహణం, సాయంత్రం మూషిక వాహనం, 13వ తేదీ ఉదయం మయూర వాహనం, సాయంత్రం సింహ వాహనం, 14 ఉదయం శేష వాహనం, స్వామి వారికి అన్నాభిషేకం, సాయంత్రం భూతవాహనం, 15న రుద్రపాదాల ముక్కోటి, సాయంత్రం నంది వాహనం, 16న ఉదయం కామధేను వాహనం, సాయంత్రం స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం, 17న ఉదయం సూర్యప్రభ వాహనం, సాయంత్రం చంద్రప్రభ వాహనం, 18న ఉదయం రథోత్సవం, సాయంత్రం కల్పతరువు వాహనం, 19న ఉదయం అధికార నంది వాహనం, సాయంత్రం రావణాసుర వాహనం, 20వ తేదీన ఉదయం త్రిశూల స్నానం, రాత్రి ధ్వజావరోహణంతో ఉత్సవాలు ముగుస్తాయని ధర్మకర్త తెలిపారు.



భారీ వర్షం.. నగరం జలమయం

తిరుపతి నగరంలో శుక్రవారం ఉదయం నుంచి భారీ వర్షం కురిసింది. దీంతో వర్షపు నీరు వీధుల్లో మోకాలి లోతు వరకు నిలవడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడ్డారు. మహతి ఆడిటోరియం ప్రధాన రోడ్డు, టౌన్ క్లబ్ సర్కిల్, తీర్థకట్టవీధి, గాంధీరోడ్డు, శ్రీదేవి కాంప్లెక్స్ రోడ్డు, మున్సిపల్ ఆఫీస్ రోడ్డు, కరకంబాడి రోడ్డు, చేపల మార్కెట్ తదితర ప్రాంతాల్లో రోడ్డుపై వర్షపు నీరు ప్రవహించింది. వాహనదారులు గొడుగులు, జర్కిన్ల సహాయంతో ప్రయాణాలు కొనసాగించారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి





ఇంక్యుబేటర్ సెంటర్‌కు నిధి ప్రోగ్రామ్ మంజూరు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ ఎస్‌పీ స్‌ఐఈ– టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్ సెంటర్‌కు నేషనల్ ఇన్షియేటివ్ ఫర్ డెవలప్‌మెంట్ అండ్ హార్నెసింగ్ ఇన్నోవేషన్ (ఎన్ఐడీహెచ్ఐ) యాక్సిలరేటర్ ప్రోగ్రామ్ మంజూరైనట్టు వీసీ ప్రొఫెసర్ ఉమ తెలిపారు. ఈ మేర కు సెంట్రల్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఉత్తర్వులు జారీ చేసినట్టు పేర్కొ న్నారు. ఈ ప్రొగ్రాం కింద రూ.44 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. నిర్మాణాత్మక మార్గదర్శకత్వం, నెట్‌వర్కింగ్‌తో స్టార్టప్‌ల అభివృద్ధిని వేగంగా ట్రాక్ చేయడమే లక్ష్యంగా ఈ నిధులు వినియోగించనున్నట్లు తెలియజేశారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

తిరుపతి సిటీ: ఎస్వీ వెటర్నరీ కళాశాల విద్యార్థులకు గురువారం సైబర్ నేరాలపై జిల్లా అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి, డీఎస్పీ ఎం శ్రీలత అవగాహన కల్పించారు. సెల్ ఫోన్లకు వచ్చే లింక్‌లపై క్లిక్ చేయవద్దన్నారు. ఓటీపీలు చెప్పరాదని పేర్కొన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండి భవిష్యత్తును బంగారు బాటగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై అవగాహన కలిగి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.జానకిరామయ్య, డాక్టర్ వేణు, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లు డాక్టర్ శ్రీనివాసరావు, అమరావతి, రాజా తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే క్యాన్సర్ నియంత్రణ

తిరుపతి తుడా: అవగాహనతో క్యాన్సర్‌ను నియంత్రించవచ్చని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. పేర్కొన్నారు. ఆయన గురువారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఎన్‌యూహెచ్ఎం స్టేట్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ జె.విజయలక్ష్మి, డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీహరితో కలిసి స్విమ్స్ ఆస్పత్రి ప్రధాన ముఖద్వారం వద్ద క్యాన్సర్ అవగాహన ర్యాలీని ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో నమోదవుతున్న మరణాల్లో ఐదవ వంతు క్యాన్సర్ ద్వారా సంభవిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రొమ్ము, నోరు, సర్వైకల్ క్యాన్సర్‌లను ముందుగా గుర్తిస్తే అరికట్టవచ్చని తెలిపారు. కొంతమంది క్యాన్సర్ లక్షణాలు ఉన్నప్పటికీ అవగాహన లేక సరైన సమయానికి చికిత్స తీసుకోలేక ప్రాణాలు కోల్పోతున్నారని వివరించారు. వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి క్యాన్సర్లతో పాటు బీపీ, డయాబెటిస్‌కు కూడా స్క్రీనింగ్ చేయాలని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, రుయా, స్విమ్స్, పీహెచ్‌సీ వైద్యాధికారులు పాల్గొన్నారు.

ఈస్ట్ సీఐ బదిలీ

తిరుపతి క్రైమ్: ఈస్ట్ సీఐ శ్రీనివాసులును తిరుపతి వీఆర్‌కు బదిలీ చేస్తూ ఎస్పీ సుబ్బరాయుడు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించడంతోపాటు అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలు రావడంతో వీఆర్‌కు బదిలీ చేసినట్టు పేర్కొన్నారు. ఈస్ట్ పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జ్ సీఐగా వెస్ట్ సీఐ రామకృష్ణ గురువారం బాధ్యతలు చేపట్టారు.

అవిలాల చెరువు అభివృద్ధికి కమిటీ



మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్ : నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలకు లోబడి అవిలాల చెరువును అభివృద్ధి చేయడానికి అధ్యయన కమిటీని ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. ఆయన గురువారం కలెక్టరేట్‌లో టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ నారపురెడ్డి మౌర్య, జేసీ శుభం బన్సల్, టీటీడీ సీఈ సత్యనారాయణ తదితర అధికారులతో కలిసి సమన్వయ సమావేశం నిర్వహించారు. అవిలాల చెరువును ఎన్జీటీ నిబంధనలకు లోబడి అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఇందులో భాగంగా టీ టీడీ సీఈ, ఇరిగేషన్ ఈఈ, పీడీ ఎన్‌హెచ్, తిరుపతి ఆర్డీవో, తుడా సెక్రటరీలతో కమిటీని ఏర్పాటు చేశా రు. రెండు వారాల్లో నివేదికను సమర్పించాలని ఆదేశించారు. సమావేశంలో తుడా సెక్రటరీ వెంకటనారాయణ, టీటీడీ ఎస్టేట్ ఆఫీసర్ గుణభూషణ్‌రెడ్డి, ఆర్డీవో రామ్మోహన్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి దశరథరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ పోస్టులు భర్తీ చేయాలి



మహాసభల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

తిరుపతి సిటీ: ఎస్వీయూలో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి చలపతి డిమాండు చేశారు. ఆయన గురువారం ఎస్వీయూ వామనరావ్ భవనం ఎదుట ఏఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఐఐటీ, ఐసర్ విద్యాసంస్థల నిర్మాణాలను పునాదులకే పరిమితం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంక్షేమ హాస్టల్ విద్యార్థుల కోసం నూతన భవనాలు నిర్మించాలని, నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా మెస్ బిల్లులు చెల్లించాలని కోరారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో ఉచిత భోజన పథకాన్ని అమలు చేయాలన్నారు. దేశంలో అత్యాచారాలు పెరిగిపోతున్నా కేంద్ర హోమ్ మంత్రి అమిత్‌షా స్పందించక పోవడం సిగ్గుచేటన్నారు. ఈ నెల 27 నుంచి 30 వరకు విజయనగరంలో నిర్వహించనున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మహా సభలను విజయవంతం చేయాలని కోరారు. వర్సిటీ అధ్యక్ష, కార్యదర్శులు రంజిత్, చంద్రనాయక్, నాగర అధ్యక్షుడు హరికృష్ణ, మహిళా కన్వీనర్లు శివరామకుమారి, శారా వరాలు, శ్రావణి, వనిత, మల్లిక, వాణిశ్రీ, మౌనిక, పద్మప్రియ, స్నేహ, నరసింహులు, రాజు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా మద్యం విక్రయాలు

- సమయ పాలన పాటించని బార్లు, మద్యం దుకాణాలు
- ప్రొటోకాల్ పాటించకపోవడంపై సర్పంచులు, ఎంపీటీసీల ఆగ్రహం



మాట్లాడుతున్న ఎంపీపీ వేముల యశోద, పక్కన ఎమ్మెల్యే పులివర్తి నాని

తిరుపతి రూరల్ : మండలంలోని బార్లు, మద్యం దుకాణాల్లో సమయపాలన పాటించకుండా ఇష్టారాజ్యంగా విక్రయాలు సాగిస్తున్నారని సర్పంచులు, ఎంపీటీసీలు మండిపడ్డారు. తిరుపతి రూరల్ ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఎంపీపీ వేముల యశోద అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు మాట్లాడుతూ అధికారులు రాజకీయ పార్టీల నాయకులకు ప్రాధాన్యత ఇస్తూ ప్రజాప్రతినిధులను విస్మరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రొటోకాల్ పాటించడం లేదన్నారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే నాని, ఎంపీపీ యశోద మాట్లాడుతూ ప్రొటోకాల్‌ను తప్పనిసరిగా పాటించాలని, శిలాఫలకాలపై ప్రజాప్రతినిధులతో పాటు స్థానిక వార్డు సభ్యుడి పేరు కూడా వేయాలని ఆదేశించారు. నిబంధనలు అతిక్రమించే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే రాత్రి 10 గంటలకు బార్లను సైతం మూసివేయాలని ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. పేరూరు చెరువులోకి మురుగు నీరు వదులుతున్నారని, అక్రమంగా మట్టిని తరలిస్తున్నట్లు సర్పంచ్ దామినేటి కేశవులు, ఎంపీటీసీ మూలం చంద్రమోహన్‌రెడ్డి ఫిర్యాదు చేశారు.

సాక్షిపై ఏడుపు...!
భారీ వర్షాలు కురవడంతో స్వర్ణముఖి నదిపై ఉన్న పలు వంతెనలు కొట్టుకుపోయాయి. తాను గెలిస్తే వాటిని తిరిగి నిర్మిస్తామని పులివర్తి నాని ఎన్నికల సందర్భంలో ఊకదంపుడు ఉపన్యాసాలు చేశారు. గెలిచిన తర్వాత పట్టించుకోలేదు. టీటీడీ నిధులతో నిర్మించేందుకు తాను ప్రయత్నిస్తే సాక్షి పత్రిక, సాక్షి ఛానల్‌లో కథనాలు రావడంతో ఆగిపోయాయని ఎమ్మెల్యే నాని తన అసమర్థతను సాక్షిపై నెట్టేందు కు ప్రయత్నించారు. మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, అన్ని రాజకీయ పార్టీలు కలిసి వస్తే తానే స్వయంగా అందరినీ తీసుకుని టీటీడీ చైర్మన్, ఈవోతో చర్చిస్తామని చెప్పడంపై విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. గతంలో తిరుపతి మాస్టర్ ప్లాన్ రోడ్లకు టీటీడీ నిధులు వాడడంపై నాడు బీజేపీ, టీ డీపీ నేతలు చేసిన విమర్శలు, ఆందోళనలను గుర్తు చేస్తున్నారు. నానికి చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించి వంతెలు పూర్తి చే యాలని డిమాండ్ చేస్తున్నారు. జెడ్పీటీసీ రత్నమ్మ, ఎంపీడీవో రామచంద్ర, అర్బన్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి, రూరల్ డీటీ జయంత్‌నాయుడు పాల్గొన్నారు.